# చిల్లంగి



**మంథా వెంకటరమణారావు కథలలో జీవన సత్యాలు తళుక్కున మెరుస్తాయి. శృంగారం లాస్యం చేస్తుంది. తెలుగు నుడికారపు సొంపు గుబాళిస్తుంది.**

ఆమె వెనుదిరిగి గోపాలాన్ని చూసి జాలిపడుతూ చిరునవ్వు నవ్వింది. కాళ్లెగరేసుకుంటూ పరుగు పరుగున ముందుకువెళ్లి ఆమె సన్నపాటి, ఎర్రటి, మృదువైన చేతివ్రేళ్లను పట్టుకొని నడక సాగించేడు గోపాలం.

"జోళ్లు వేసుకోరాదురా గోపీ?" ఆమె మృదు మధురమైన గొంతు అతడి చెవుల కెంతో ఇంపుగా వినిపించింది. తల ఎత్తి ఆత్రంగా ఆమె కళ్లలోకి చూసేడు. ఎంత ఎత్తుందో! అంత ఎత్తు ఎప్పుడయినా తను ఎదగ్గలడా? ఆమెలా తనూ అవగలుగుతే ఎంత బాగుంటుంది! "ఇలా గొడుగు నీడలోకి రా గోపీ."

గోపీ ఆమె దగ్గరగా వెళ్లి ఆమె కాళ్లకు తగుల్తూ నడక సాగించేడు.

ఆమె చీరకొంగు అతడి చెక్కిళ్లకు చల్లగా తగుల్తోంది అంత ఎండలోనూ.

చాలా మంచి చీర. మెత్తగా, హాయిగా ఉంది. మంచి వాసన, మల్లెపువ్వులు తన ముక్కు దగ్గర ఉన్నట్టు! క్రిందికి చూసే అతడి కళ్లు ఆమె పాదాలమీద పడ్డాయి. ఎంత అందమైన పాదాలు - తెల్లగా!

ఆ గోళ్లు తను ఆడుకొనే ఆలుచిప్పల్లా ఎంతో బాగున్నాయి. ఆమె కాళ్లకి ఆకుచెప్పులున్నాయి. తన కాళ్లకి లేవు. ఎన్నిసార్లు చెప్పినా నాన్న కొనరే! ఆలోచిస్తూ వెనుకపడ్డాడు. కాళ్లు చుర్రుమన్నాయి చెప్పులు లేవనుకోగానే. మళ్లీ పరుగు తీసేడు.

ఇంకోసారి ఆమె చిరునవ్వు, ప్రేమగా. ఎంత వేగంగా నడిచిపోతోందో!

ఈ పెద్దవాళ్లంతా ఇంతే. వాళ్లకేం? అంతంత లేసి కాళ్లు.

తనకూ అలానే కాళ్లుంటే? అమ్మో! వీళ్లందరినీ మించిపోడా తను?

జారిపోతున్న లాగుని ఎగదీసుకున్నాడు. "నీ పలకా, పుస్తకం ఇలా ఇయ్యి."

చిత్రాలు: పి.ఎస్. బాబు



మారు మాట లేకుండా ఆమె కందించేడు, చంకలో ఉన్న చత్రాం ఊడొచ్చిన పలకనీ, అట్టలేక నలిగిన పుస్తకాన్నీ. బస్తాడు బరువు తగ్గినట్లయింది.

ఇప్పుడు తేలిగ్గా నడిచెయ్యొచ్చు. తన నడకెందుకో అంత బాగుండదు. ఎప్పుడావిడలా నడుద్దామనుకున్నా రాదు. ఆవిడెంత సొంపుగా నడుస్తుంది! ఆ కాళ్లు కాలాన్ని లెక్క పెడుతున్నట్లు వాచీ ముళ్లలా కదుల్తాయి.

రోడ్డంతా కలియజూసేడు. ఎక్కడా మనుష్య సంచారమే లేదు.

పొలాల్లో ఒక కోడె, ఆవు దగ్గర దగ్గరగా నిల్చున్నాయి. రోడ్డుకి ఇటూ అటూ బ్రహ్మాజెముడు డొంకలు. అరఫర్లాంగు దూరాన చింతచెట్టు జుత్తు విరబోసుకున్న పిచ్చిదానిలా కనిపిస్తోంది. ఇసుకలో పాదాలు కూరుకుంటూ కస్సుకస్సుమని శబ్దం చేస్తున్నాయి. ఈ ఇసుకలో నడవడం ఎంత బాగుంటుందో! కాళ్లు కూరుకపోతూ అప్పుడే కుట్టించిన బూరుగుదూది పరుపుమీద నడచినట్టుంటుంది. అన్నయ్య పెళ్ళికి ఆ ఊరేదో వెళ్లినప్పుడెంత బాగుండేది! ఆ వూళ్లో పెద్ద సముద్రముంది. ఆ పెద్ద ఇసుక దిబ్బలు - అక్కడలా ఆడుకుంటూ ఉండిపోతే ఎంత బాగుణ్ను! కానీ ఈ పెద్దవాళ్లున్నారే! ఏం మనుష్యులో! తనను ఒక్కడ్నీ అక్కడ ఇష్ట మొచ్చినంత కాలం ఆడుకోనివ్వలేదే? మళ్లా ఎప్పుడు వెళ్లడం అక్కడికి? పెద్దవాడ్నయాకా? ఇంకా ఎప్పుడు పెద్దవడం? అమ్మో! ఈవిడంత ఎదగడానికి ఎన్నాళ్ళవుతుందో కదా!

గోపీ ముఖాన చెమట్లు పోశాయి. అబ్బ! ఏం ఎండ! పరుగెత్తి ఆమె గొడుగు నీడలోకి వెళ్లేడు. ఎంత వేడైనా ఎండాకాలం ఎందుకో బాగుంటుంది. మామిడి చెట్లకు ఇక్కడ ఇంకా పెద్ద కాయలు లేనేలేవు. మొన్న సూరిగాడు పట్టుకొచ్చిన కాయ లెంతెంత లున్నాయో! ఆ తోట కావలాదారుకు ఒక పాత లాల్చీ ఇచ్చేస్తే కాయలన్నీ మనవేనట. మొన్న చిన్నన్నాయి పళ్లు పులిసి అన్నం తినలేకపోయేడు. ఎందుకో వీళ్ళెవ్వరూ తనని రానివ్వరు వాళ్లతో. వాళ్ళ గొప్పేమిటో!

తల ఎత్తి ఆమె ముఖాన్ని చూసేడు గోపాలం. అక్కడక్కడ చెమట పట్టినా తెల్లగా ఉందామె ముఖం. ఆమె కనురెప్పల కాటుక కాస్త చెదిరింది. ఎదురుగాలికి ఆమె ముంగుర్లు కళ్ళతో దోబూచులాడుతున్నాయి.

ఆమెకు తగుల్తూ నడవసాగేడు. ఆమె చెయ్యి అతడి భుజంమీద వేసింది.

ఎంత మెత్తటి చెయ్యి! ఇంత ఎండవేడిలోనూ చల్లగాకూడా ఉంది. ఆమె చేతి వ్రేళ్ళు చెక్కిళ్లకు తగిలేటందుకు మెడని పక్కకు తిప్పేడు. పువ్వులంత సున్నితంగా తగిలేయవి.

చింతచెట్టు దగ్గర పడింది. పెద్దనీడ అక్కడ. అక్కడి నీడలో కాసేపు ఆగితే బావుణ్ణనిపించింది. రోజూ అలానే ఆగుదామనిపించినా, ఆమెతో చెప్పడానికి గోపీకి ఇష్టంలేదు. జోళ్ళెందుకు వేసుకోలేదంటుంది.

చింతచెట్టు నీడలో వేగం తగ్గించేడు. ఆమె వెనుదిరిగి ఇంకోసారి నవ్వింది అతడి మనసులోని భావం తెలుసుకుందా? ముఖం దించుకున్నాడు సిగ్గుపడుతూ.

**గోపీ ముఖాన చెమట్లు పోశాయి. అబ్బ! ఏం ఎండ! పరుగెత్తి ఆమె గొడుగు నీడలోకి వెళ్ళాడు.**

చెట్టు గాలి చల్లగా కొడుతోంది. ఎంతో హాయిగా ఉంది.ఇక్కడ తన చిన్నమంచం వేసుకు పడుక్కుంటే ఇట్టే నిద్రపట్టేస్తుంది. ఈ పెద్దవాళ్లతో అన్నీ చిక్కే. సరిగ్గా పడుక్కోనివ్వరు. ఆడుకోనివ్వరు. ఇష్టమయిన తిండి తిననివ్వరు. ఇంక వాళ్ళు మాత్రం......అన్నాయి బాగా పొద్దెక్కుతేనే కానీ లేవనే లేవడు. పొద్దున్నే వాడికి ఫలహారం, మధ్యాహ్నం భోజనంలోకి చేపలు ఉండితీరాలి. మంచి బట్టలు, కాళ్లకి జోళ్ళు- దొరలా తయారవుతాడు. ఒదినా, వాడూ సినీమాకి పోతారు. తనని మాటవరసకన్నా రమ్మనరు. మెత్తటి చెయ్యి అతడి తలని నిమిరింది. తలెత్తి చూసేడు. ఆమె అతడి కళ్లలోకి సాదరంగా చూస్తోంది. ఈసారి ఆమెకు మరింత దగ్గరగా హత్తుకొని నడవసాగేడు.

స్కూలు మెట్లెక్కాక ఆమె చేతి వ్రేళ్లు వదిలాడు గోపీ. స్కూలు ఖాళీగా ఉంది. మగా ఆడా కలిపి పదిమందిలా ఉంటారు పిల్లలు. ఆమె వెంటే క్లాసు గదిలోనికి వెళ్ళి బెంచీమీద కూర్చున్నాడు. ఆమె గది వదిలి ఎక్కడికో వెళ్ళింది. ఎదురుగా ఉండే బ్లాకుబోర్డునీ, ఆమె కూర్చుండే కుర్చీనీ, దానిముందున్న టేబిలునీ చూస్తూ కూర్చున్నాడు.

ప్రొద్దున్న కొత్త మాస్టారేసిన గుణకారం లెక్క ఆ నల్లబల్లమీద ఇంకా ఉంది. టేబిలు మీద పేకబెత్తాం. ఎందుకో గుండె గబగబా కొట్టుకుంది. గుణకారం లెక్క ఇంకోసారి చూసేడు. తనా లెక్క చెయ్యలేదు. అతడి ముఖం పాలిపోయింది. ఆమే ఆ లెక్క వేసి ఉంటే ఎంత బాగుణ్ను! ఏడుపొస్తున్నట్లయింది. ఒక్కసారి ఏడవాలనిపించింది.

ఆ కొత్త మాస్టార్ని చూస్తే ఏదోలా అనిపిస్తుంది. ఆ మాస్టారు లెక్కవేస్తూ ఉంటే అతని ప్రక్క నిలబడి అందర్నీ చూస్తూ చిరునవ్వు నవ్విన ఆమెను చూసేసరికి ఎందుకో కోపం వచ్చిందామెమీద. ఏదో పోగొట్టుకుంటున్నట్లు

అనిపించింది. గదంతా కలియజూసి, ఎవ్వరూ లేరని తెలుసుకొని, భయపడుతూ వెళ్ళి, లెక్కని కసితీరా చెరిపి పారేసేడు గోపాలం. తన ధైర్యానికి తనకే ఆశ్చర్యం వేసింది.

వెనుక నించి మెత్తటి చెయ్యి భుజంమీద పడింది. ఉలికిపడి వెనక్కి తిరిగి చూసేడు- ఆమె! తను చేసిన పని చూసిందేమో? చూస్తే చూడనీ!

"గోపీ! ఈ చల్లటి నీళ్ళు తాగు!" గ్లాసుతో నీళ్లందించింది. చిలిపిగా నవ్వుతోంది. అతడి నుదుటి చెమటను చీరకొంగుతో తుడిచింది నీళ్లు తాగుతూఉంటే. గ్లాసు ఆమె కందించి పోయి తన స్థానంలో కూర్చున్నాడు. ఆమె గ్లాసుని టేబిలు మీద ఉంచి, కుర్చీలో ఆలోచిస్తూ కూర్చుంది.

బడి రెండో గంట మ్రోగడంతో పిల్లలు రావడం ఎక్కువయింది.

పైన చెప్పుల చప్పుడు. కొత్త మాస్టారు ఆదరాబాదరాగా వచ్చేరు. పెద్దన్నాయిలానే ఉన్నాడు. నొక్కునొక్కుల జుత్తు. బాగున్నాడు. అతడు రాగానే గదంతా సెంటువాసన గుమ్మని కొట్టింది.

ఆమె లేచి నిల్చొని, చిరునవ్వు నవ్వి నమస్కరించి పక్కకు తప్పుకుంది.

అతడు ప్రతినమస్కారం చేస్తూ అన్నాడు- "మీరు కూర్చోండి."

"ఫరవాలేదు." ఆమె అంది తెల్లటి పలువరుసని వెలిబుచ్చుతూ, చిరునవ్వుతో. ఇద్దరూ నిల్చొనే వారిద్దరికే వినిపించేటంత మెల్లగా మాట్లాడుకున్నారు. ఆవిడన్న ప్రతి మాటకీ అతడు నవ్వులే.

పీరియడ్ ప్రారంభం గంట కొట్టగానే అతడు వెళ్లిపోయేడు. ఆమె పాఠం చెప్పనారంభించింది. కానీ గోపీ మనసు ఆందోళన చెంది ఉంది. అందువల్ల ఒక్క పదం కూడా అతడి మనసుకు పట్టుబడడం లేదు. ఆఖరి పీరియడయి అంతా వెళ్లిపోతూ ఉంటే అతని కాశ్చర్యం వేసింది. గదంతా ఖాళీ అయినా అలా కూర్చుండిపోయేడు.

**ఆమె ఒడిలో స్వర్గంలో ఉన్నట్టనిపించింది గోపాలానికి. ఎప్పుడూ ఎరగనంత సంతోషం అనుభవించేడు.**

ఆమె గొంతు వినిపించి తలెత్తేడు. "గోపీ, ఇంటికి పోదాం పద." ఎప్పటిలానే చిరునవ్వు ఆమె పెదాల మీద.

అకారణంగా గోపీ మనసు బరువెక్కింది. ఆమెతో ఏదో చెప్పాలనిపిస్తోంది. కానీ మాటలు పెగలడంలేదు. దగ్గరగా వెళ్లి పలకా, పుస్తకం అందుకుందామె. ఆమె ప్రేళ్లతడి చేతిని పట్టుకున్నాయి. గోపీకి ఎంతో హాయిగా అనిపించింది.

బయట చెప్పుల నడి. కొత్తమాస్టారు మళ్లా తయారు. రాగానే గోపాలంవేపు అదో మాదిరిగా చూస్తూ అడిగాడు- "ఎవరీ అబ్బాయి?" మనిషి బాగున్నా గొంతు బొంగురుగా, గాడిద స్వరంలా అనిపించింది గోపాలానికి. తానెవడైతే ఈయనకేం? ఏమిటా అడగడం మర్యాద లేకుండా! అబ్బాయిట అబ్బాయి! ఆవిడ ముద్దుల కొడుకుని నేను - నువ్వెవడివి ఫో అని ధీమాగా తనంటే అప్పుడు నేనెవరో తెలుస్తుంది అయ్యగారికి.

ఆమె అతడి చేతిని మరింత నొక్కిపట్టుకుని.."మా గోపీ, మా వీధిలోనే గోపీ ఉంటున్నది" అంది. ధీమాగా నిల్చున్నాడు గోపాలం. కొబ్బరిచెట్టంత ఎత్తు ఎదిగిపోయినట్లనిపించింది. "మా గోపీ" అని అందామె. ఏమిటనుకుంటున్నాడో కొత్త మాస్టారు తన గురించి!

మాస్టారు అదోమాదిరిగా నవ్వుతూ, "మీ వీథేం? రేపట్నుంచి నా వీథి కూడా ఒస్తా" అంటూ వెళ్లిపోయేడు. అతడామె కళ్లలోకి చూసిన చూపు వెగటుగా తోచింది గోపాలానికి.

చింతచెట్టు దగ్గర పడగానే తలెత్తి చూసేడు. ఆమె వ్రేళ్ల మధ్య అతడి చెయ్యి ఉయ్యాలలూగుతోంది. ఆమె అస్తమిస్తున్న సూర్యుడికేసి కలలు కంటూ చూస్తోంది. ఎర్రటి రక్తపు గోళంలా సూర్యుడు కొండల్లోకి దిగిపోతున్నాడు.

ఇంటి దగ్గర చిన్న చెల్లిపాటికి ఇనపకుర్చీని బోర్లావేసి వీథిలో తనకోసం చూస్తూ ఉంటుంది బస్సాటకి. ఈవాళ తను డ్రయివరు. ఎకాయెకీని బొబ్బిలినించి విజనారం వరకూ నడుపుతాడు. ఏడుస్తుంది తను డ్రయివరవతానని. ఏడవనీ!

ఇల్లు దగ్గర పడింది. తనున్నట్లే గుర్తులేనట్లు ఆమె ఏదో ఆలోచనలో మునిగిపోయింది. నడుస్తున్నదే కానీ తనకేసి చూడడంలేదు. గోపీ మనసులోని ఉత్సాహం పోయింది. ఇంటి వరండామీద తన చెల్లెలు ఇనపకుర్చీని బోరగిల్లా పెట్టి డ్రయివింగ్ సీట్లో కూర్చొని "బోఁ య్!..బోఁ య్!" మని హారన్ కొడుతోంది నోటితో. తనని చూడగానే "గోపీ! వేగం రా! ఆలస్యం చేసేవంటే బస్సు తప్పిపోగలవ్!" అంటూ అరిచింది.

తమ ఇంటిముందాగేడు గోపాలం. ఆమె చేతిని వదుల్తూ చిన్న గొంతుతో అన్నాడు: "అమ్మగారూ!"

"ఏంరా గోపీ? ఏం కావాలి?" ఆత్రంగా అన్నదామె.

అతడి గొంతు బాగా తగ్గిపోగా తల దించుకున్నాడు. "రేపు స్కూలుకు మీతో పాటు తీసుకెళ్తారా?"

ఆమె జవాబుగా చిరునవ్వు నవ్వి, అతడి చెక్కిళ్లని నొక్కి పుస్తకం, పలక



అందించి ఆమె ఇంటికి వెళ్లిపోయింది.

చిన్న చెల్లి కేక పెడుతోంది. "పోనీలేరా! ఇవాళ నువ్వే డ్రయివరుగా ఉండు. అందుకేనా అలా ముఖం పెట్టేవు?"

కానీ గోపాలానికి ఇవాళ ఆడాలనిపించనేలేదు. గేటు ముందు నిలబడిపోయి వీథి కొనకున్న అమ్మగారి ఇంటికేసి చూస్తూ ఉండిపోయేడు.

* * *

చింత చెట్టు చేరువయింది. గోపాలానికి కాళ్ళు బరువుగా పడుతున్నాయి. స్కూలుకు వెళ్లడం అతడి కెందుకో ఇష్టం లేకుండా ఉంది. తల ఎత్తి ఆమె ముఖం కేసి చూసేడు. ఆమె రోజూలానే ఏదో తీవ్రంగా ఆలోచిస్తోంది. ఏమిటో అంత ఆలోచన ఈమెకు? ఆ కొత్తమాస్టారొచ్చినప్పట్నించీ ఈవిడిలా మారిపోయింది.

చిల్లంగి పెట్టేడేమో! ఈ చిల్లంగి వాళ్లు శ్మశానంలో రాత్రులు తిరుగుతారట! అమ్మో! చిల్లంగి వాడితో ఈవిడ మాట్లాడ్డమే! శ్మశానం అంటేనే భయమేస్తుందే? అందులో దయ్యాలూ, భూతాలూ అవీ ఉంటాయి. చచ్చిపోయిన నూర్ కూడా అక్కడ దయ్యమై ఉండాలి. బ్రతికున్నప్పుడు దయ్యం బొమ్మలు వేసి, వాటితో తనని భయపెట్టి, తనదగ్గర పలక పుల్లలూ, పైసలూ గుంజుతూ ఉండేవాడు.

ఓ దయ్యాన్ని చూడాలని ఉంటుంది తనకి. కానీ ధైర్యం ఉండొద్దూ? కొత్తమాస్టార్ని చూపించమంటే? చిల్లంగి వాళ్లతో మాట్లాడ్డమా? కానీ అతడు భయం కలిగేలా ఉండడే. అయినాసరే అతన్తో తను మాట్లాడడు. అతడంటేనే అసహ్యం తనకి. మంచివాడు కాడు. ఈమెకి చెప్పాలా మాట. అతనితో మాట్లాడొద్దని ఆమెకు చెప్పాలి. చిల్లంగి పోగొట్టడానికి నూర్ నాన్న ఖాదరు సాయిబుకు చెప్తే ఇట్టే పోగొట్టేస్తాడు. ఆవిడ 'ఊఁ-' అంటే ఖాదరు సాయిబుని తీసుకురావడం తనది పూచీ. ఖాదరు సాయిబు దయ్యాల్ని పట్టి వాటి చేత మాట్లాడిస్తాడుట. మనుమల పుర్రెలు దండలు గుచ్చి ఉంటాయిట అతని ఇంట్లో! అతనికి కాళికాదేవి ప్రత్యక్షమయిందట కూడాను.

గోపాలం సంకోచిస్తూ ఆఖరి కన్నాడు:. "అమ్మగారూ?"

"ఏంరా గోపీ?" ఆమె అంది ఆత్రంగా.

"మరేం....మన కొత్త మాస్టారు మంచివారేనా అమ్మగారూ?"

ఆమె పకపకా నవ్వి అంది,: "చాలా మంచివారు. ఏం? నిన్నేమన్నా అన్నారా?"

లేదన్నట్లు తల ఊపేడు గోపాలం.

ఈవిడ కేం చెప్పినా అర్థం కాదు. అసలు చిల్లంగి సంగతే ఈమెకు తెలీదే. ఎలా తెలుస్తుంది పాపం? ఈ చిల్లంగివాళ్లు తెలీకుండా చిల్లంగి పెట్టేస్తారే. ఓసారి ఓ చిల్లంగిది దొరికిపోవడం సంగతి గుర్తుకొచ్చింది. ఖాదరు సాయిబు వెంటనే వచ్చి, దాని ముందు రెండు పళ్లూ పెరక్కొట్టి, వాటికి మంత్రం వేసి పాతిపెట్టాకకానీ దాన్ని వదల్లేదు. ఈ మాస్టారికీ అలా చేస్తే సరిపోతుంది.

అమ్మగారితో తాను ఉన్నప్పుడు కొత్తమాస్టారు వస్తే, తనకేసి అయిష్టంగా చూస్తాడు, తనక్కడ ఉండడం సహించలేనట్లు. తనకే చిల్లంగి పెడతాడా? తనకా! బ్రహ్మదేవుడు దిగిరావాలి! తన సంగతి తెలీదు కాబోలింకా! ఖాదరు సాయిబుకి తనంటే ఎంత ఇష్టమో! ఒక్క మాట తాను సాయిబు చెవిలో వేస్తే చాలు, కొత్తమాస్టారు పని సరి! తనదగ్గరా వీడి ఆటలు!

"అమ్మగారూ, మరి కొత్త మాస్టారు మన వీథిలో దిగేరు కదా? అలా అక్కడే ఉండిపోతారా అండీ?"

ఇంకోసారి ఆవిడ నవ్వి అంది- "ఏంరా గోపీ? ఆ మాస్టారంటే ఎందుకు నీకంత ఇది?"

ఆవిడ మాటలు ఇష్టమవలేదు గోపాలానికి. ఈవిడకీ మాస్టారంటే ఎందుకో ఇష్టమున్నట్లుందే? చిల్లంగి పెట్టేసే డీవిడకి! పావం, ఈవిడకా సంగతి తెలీదు. చెప్పాలి తను. ఎంత సాయమన్నా ఈమెకు చేస్తాడు. అమ్మవారికి మొక్కుకుంటాడు కోడిని బలి ఇస్తానని.

ఆమెకు దగ్గరగా వెళ్లి ఆమెకు తగుల్తూ నడవసాగేడు.

మగతలో ఉన్నట్లు నడుస్తున్న గోపాలం వెనుక నుంచి చెప్పుల చప్పుడు వినిపించి తిరిగి చూసేడు. కొత్తమాస్టారు! ఆమెను కలుసుకొనేందుకు గబగబా నడుచుకొస్తున్నాడు. గోపాలం ముఖం వాడిపోయింది.

ఆవిడ కూడా తిరిగి చూసింది. మాస్టార్ని చూడగానే ఆగిపోయింది. ఆమె ముఖం ఆ ఎండలో వెలిగిపోయింది. అతడు కనిపించగానే ఎందుకో ఆమెకు ఆనందం! అది చిల్లంగి మహిమే! అతడూ నవ్వుతూ దగ్గరయ్యాడు.

"ఏం ఇంత వేగం బయల్దేరిపోయేరు? ఇంకా వేళ ఉందిగా!" అనడిగాడు.

"కాస్త ముందుగా వెళ్తే విశ్రాంతి తీసుకోవచ్చు. ఎండలో వెళ్లడం మరి."

అతడేదో అనబోయి అనుమానంగా గోపాలంకేసి చూసేడు. గోపాలం వెంటనే ఇది కనిపెట్టేడు. అతడి మనసు ఆ మాస్టారిమీద ఏహ్యాభావంతో నిండింది. ఉత్త చిల్లంగివాడు. దయ్యాలవాడు. మంత్రాలు వేసి ఆమెని మార్చేసేడు!

కొత్త మాస్టారంటున్నాడు- "నిన్న సాయంత్రం ఒక్కడ్నీ అలా షికారుకి పోయేను. మీరు ఇల్లు కదల్లేనట్లుంది. ఓ సారలా మంచిగాలి పీల్చుకుందుకు బయటకు వెళ్తే తప్పేమీ లేదు కదా?"

ఆమె అతడికేసి అదోరకంగా చూసి చిరునవ్వు నవ్వి ఊరుకుంది.

రోడ్డు మధ్యని ఆగిపోయేడు గోపాలం.

"ఏం గోపీ? ఏమయింది?" ఆమె కూడా ఆగిపోయింది ఆశ్చర్యపోతూ.

వెలవెలబోతూ గోపాలం అన్నాడు: "మొహం తిరుగుతోందమ్మగారూ." ఆ మాటలంటూనే రోడ్డుమీద పడిపోయేడు బార్లా. ఆమె ఆత్రంగా గోపాలాన్ని ఒడిలోకి తీసుకుంది. కొత్త మాస్టారు విసుగ్గా చూస్తూ నిల్చోగా, ఆమె గోపాలాన్ని పేరుపెట్టి పిలుస్తూ కుదిపింది- "గోపీ, చూడు. ఏమయింది నీకు?"

గోపాలం కళ్ళు మూతలుపడి ఉన్నాయి. ముఖం వాడిపోయింది. ఆమె తొందరగా లేచి, అతడ్ని భుజాన వేసుకొని, పెద్ద అడుగులు వేసుకుంటూ ఇంటి వేపు నడిచింది.

కొత్త మాస్టారు ఏం చెయ్యడానికీ తోచక చూస్తూ నిల్చుండిపోయేడు.

ఆవిడ ఒడిలో స్వర్గంలో ఉన్నట్లనిపించింది గోపాలానికి. ఎప్పుడూ ఎరగనంత సంతోషం అనుభవించేడు. అతడి మనసు విజయగర్వంతో నిండింది.

ఇప్పుడు రానీ, ఏ చిల్లంగి వాడొస్తాడో! గోపాలం దగ్గరా చిల్లంగి? ఏవో హాయిగా ఊహలు రాగా తృప్తిగా కళ్ళు మూసుకున్నాడు గోపాలం.

దూరంగా ఆకాశం మీద ఏదో పక్షి వికారంగా కూస్తూ ఎగిరిపోయింది. ప్రక్కనున్న పొదలో చిన్న సడి. ఉడుత ఒకటి ఎగురుకుంటూ పోయి దగ్గరనున్న చెట్టెక్కింది. చీకట్లో తుప్పల మధ్య ఊపిరి సడి కూడా వినిపించనివ్వకుండా కూర్చున్నాడు గోపాలం.

ఎదురుగా ఉన్న కొత్త మాస్టారింటి తలుపు వేసి ఉంది. లోన దీపం వెలుగుతోంది. కానీ మాస్టారింట్లో ఉన్నట్లు లేదు.

చీకటి ఆకాశంలోని మెరిసే నక్షత్రాలను చూస్తూ కూర్చున్నాడు గోపాలం. చేతులనేదో రాసుకుంటూపోయింది. ఉలికిపడి ప్రక్కకు తప్పుకున్నాడు. ఉదయించబోయే చంద్రుడి కిరణాల ముందున్న తూరుపుకొండ నల్లటి రాక్షసిలా అనిపించింది.

దూరంగా చప్పుడయింది. పాదాల సడి. ఇద్దరు వ్యక్తులు నడుచుకొస్తున్నారు రోడ్డుమీద. గోపాలం మరీ పొదల చాటుకి పోయేడు.

ఇద్దరు వ్యక్తులూ దగ్గరపడగానే వాళ్లు కొత్తమాస్టారూ, అమ్మగారూ అని గోపాలం గుర్తుపట్టేడు. అతడి ముఖకవళికలు పూర్తిగా మారిపోయేయి. ముఖం ఎర్రబారి పెదాలు వణకసాగేయి. మరీ ఊపిరి బిగపట్టి కూర్చున్నాడు.

కొత్తమాస్టారంటున్నాడు- "పొదుపుగా వాడుకుంటే నా జీతం మనిద్దరికీ హాయిగా సరిపోతుంది. దాని కోసం చింతెందుకు? పిచ్చిదాన్లా ఉన్నావు!"

మాస్టారి ఇంటిముందు ఇద్దరూ ఆగేరు. అతడామె చేతుల్ని తన చేతుల్లోకి తీసుకున్నాడు. ఆమె తల దించుకుని నిల్చుంది. మౌనంగా కొద్ది క్షణాలు నిల్చొని ఇరువురూ విడిపోయేరు. కొత్త మాస్టారు అతడి ఇంట్లోకి పోగా, ఆమె తన ఇంటికి పోయింది.

గోపాలానికి తెలియని ఆవేశం ముంచుకొచ్చింది. లేచి నిల్చొని మళ్లా కూర్చుండిపోయేడు. జ్వరం వచ్చినట్లుగా ఒళ్ళంతా ఒకేలా వణకుతోంది. అతడి కుడి చెయ్యి వణకుతూ జేబులోకి వెళ్లింది. ఆ లేత కళ్లు భయంకరంగా మారేయి.

నిప్పు పెట్టెను పట్టుకొని జేబులో దూరిన చెయ్యి బయట కొచ్చింది. వణకే వ్రేళ్లతో పెట్టె తెరిచి ఒక పుల్ల తీసి, సందేహిస్తూ పెట్టె అంచుమీద కొట్టేడు.


భగ్గుమని అంటుకుంది పుల్ల. ప్రపంచమంతా మండిపోతున్నట్టనిపించింది గోపాలానికి. చాలా భయం వేసింది. ఊది ఆర్పేసేడు మంటని. వణకే చేతులలోంచి నిప్పుపెట్టె జారింది.

మంత్రముగ్ధుడిలా కొత్త మాస్టారింటిని చూస్తూ కూర్చున్నాడు.

చంద్రుడు బాగా పైకొచ్చేడు. ఆ కాంతిలో గోపాలం ఒళ్లు ఒక నీడలా, నేలమీద ఒక మచ్చలా ఉంది.

దూరంగా అడవిలో ఒక ఆవు ఎలుగెత్తి అరుస్తోంది.

ఒక్క ఉదుటున లేచేడు గోపాలం. అతడి కళ్ళంట నీళ్ళు కారుతున్నాయి. ఆవేశంతో ఆ ఇంటిని చూస్తూ మెల్లగా పెదవుల క్రింద అనుకున్నాడు: "చిల్లంగి". ఆ మాటలంటూ పొదల్లోంచి బయటకు గెంతి, నత్తువకొద్దీ పరుగెత్తుకుంటూ పోయేడు.



పెద్దన్నాయి దొరగారిలా టోపీ, నల్లటి కళ్లద్దాలూ అవీ పెట్టుకొని సడి చెయ్యని జోళ్ళతో ఖేమగ్గా నడుస్తూ వెళ్లి, లాభం లేక గోపాలాన్ని తిడుతూ, చలవ జోళ్లని పైకి తీసి వ్రేళ్లతో ఆడిస్తూ, తల దించుకుని వెళ్లిపోయేడు.

రోడ్డు మీద నిల్చొని సర్వజ్ఞారాలు సుబ్బమ్మ రెండు దవడలూ గట్టిగా నొక్కుకుని, మూతి విరిచి, తలమీది సైనుపంచ ముసుగుని సర్దుకొని, ఎక్కడికో చాలా తొందర వార్తను మోసుకుంటూ నడుచుకుపోయింది.

దూరంగా బారికి పైడయ్య కరణంగారి అవుదూడ వెంట పరుగు తీస్తున్నాడు.

గదిలో నలుగురైదుగురిలా మనుష్యులున్నారు.

ఇంకా బాగా పొద్దెక్కలేదు. సూర్యుడి ఒక కిరణం గది చూరులోనుండి సందు చూసుకువచ్చి సులకమంచం ప్రక్కని పడుతోంది.

సులకమంచం మీద పడుకున్న మాస్టరమ్మ గారి ముఖాన్ని నిశ్చలంగా చూస్తూ, తలప్రక్క నేలమీద కూర్చున్నాడు గోపాలం.

అమ్మగారి చీరనుంచి తేలికైన మల్లెపూల పరిమళం మంచులా చల్లగా గదంతా నిండింది. ఆమె కట్టుకున్న వాయిలు చీర ఇస్త్రీ మడతలు చెక్కు చెదరకుండా తీర్చి దిద్దినట్టున్నాయి.

ఆమె ఒళ్లంతా మామూలుగా ఉన్నా కడుపు దగ్గర ఒక గుట్టగా ఉంది. ఎప్పట్లానే ఆమె ముఖం తెల్లగా, సాఫుగా, అందంగా ఉంది. కన్నీరు కారడం వల్ల కళ్లకున్న కాటుక చెదిరి చెక్కిళ్లమీద మరక చేసింది. శుభ్రంగా దువ్వుకున్న జుత్తు. పెదవుల మీద జాలి చూపేలా చిరునగవు.

అరవిందం మాస్టారు ఉదయం నించి చాలా హడావిడిగా ఉన్నాడు. అతడి ఖద్దరు కమీజు భుజంవద్ద చిరుగులతో ఎటో పోతానంటూ బెదరిస్తోంది. ఆఖరికి చిరాకెత్తి కాబోలు అది పోకుండా అతడే దానిని పైకి లాగి నడుముకు చుట్టుకున్నాడు.

అరవిందం మాస్టారి సంగతి ఆ వూళ్ళో అందరికీ తెలిసిందే. గాంధీవాది. పరోపకారి. ఎక్కడెవరికి కష్టం వచ్చినా వెళ్ళి ఆదుకొనే మనస్తత్వం. సత్యం, అహింస, నిస్వార్థం, పరోపకారం అతడి జీవితాన్ని నడిపించే మూల సూత్రాలు. తల నెరసి, ముఖం ముడతలు పడ్డా శ్రమించడానికి వెనుకాడడు.

వీథిలో ముగ్గురు మాస్టార్లు వెదురుబద్దలు చీల్చి గబగబా పాడె తయారు చేస్తున్నారు. ఇంకో ఆయన పిడకలు ముక్కలుగా విరిచి నిప్పువేసిన కుండలో పేరుస్తున్నాడు. కాస్త దూరంగా వీథిలో హెడ్ కానిస్టేబుల్ సోమనాథం బీడీ కాలుస్తూ పచార్లు చేస్తున్నాడు.

అరవిందం మాస్టారు బయటకొచ్చారు. రాగానే అతడికి కంట పడింది కాకీ బట్టల్లోని సోమనాథం. మాస్టారు సోమనాథాన్ని చూడగానే గాబరా పడ్డారు. అక్కడ్నించే వంగి ప్రణామం చేసి, జారిపోయే కచ్చ సరిజేసుకుంటూ హెడ్డుగారి వేపు పరుగు తీశారాయన. గౌరవాన్ని స్వీకరిస్తూ ఆ కాకీ బట్టల్లోని ఆయన చాలా హొదాగా తల ఊచేడు, చిరునవ్వు విసుర్తూ. ఇద్దరూ ఏదో ఏదో చాలా చాలా మాట్లాడుకున్నారు. ఆఖరికి అతడూ, మాస్టారూ కలిసి టీ దుకాణం కేసి నడిచేరు.



పెద్దన్నాయి, అరవిందం మాస్టారు హడావుడిగా గదిలోకి రావడం గోపాలం గమనించలేదు. అప్పుడే బాగా పొద్దెక్కింది. నడుముకి చుట్టుకున్న కమీజుని కూడా తీసి పారేశారు మాస్టారు.

గోపాలం మంచం మీద చేతులాన్చి అమ్మగారి ముఖంలోకి చూస్తూ కూర్చున్నాడు.

పెద్దన్నాయి గోపాలాన్ని ఒక్కపాళంగా మీదికెత్తేడు. గోపాలం గిలగిలా కొట్టుకొని పెద్దన్నాయి మండ కొరికేడు. అంత మీదనించీ గోపాలం క్రిందికి పడ్డాడు. మండ నించి రక్తం కారుతోంది. గోపాలాన్ని మెత్తటి బూటుతో ఒక్క తాపు తన్ని ఏదో తిట్టుకుంటూ బయటకు పోయేడతడు.

తనకంతా అర్థమయిందన్నట్టు ముఖం పెట్టి, ఒక సాధువులా వెళ్లి గోపాలం పక్కని చతికిలపడ్డారు అరవిందం మాస్టారు.

ముగ్గురు మాస్టార్లూ పాడె కట్టడం పూర్తిచేసి వచ్చి ఆయన వెనుక నిల్చున్నారు.

అరవిందం మాస్టారి చెయ్యి గోపాలం తలపైన పడింది. తలని మెల్లగా నిమురుతూ ఏదో చాలా కష్టమైన పనిని నెత్తిన వేసుకున్నట్టు ముఖం పెట్టి మెల్లగా గోపాలాన్ని సంబోధించే రాయన - "నాయనా గోపాలం."

గోపాలం మాటాడలేదు ముఖమైనా మాస్టారి వేపు తిప్పి. అతడి వయసుకివ్వవలసిన గౌరవం ఇవ్వలేదు. జీవితంలో ఎన్నో ఢక్కామొక్కీలు తిన్న మాస్టారు ఇది పట్టించుకోలేదు. విరాగి ముఖం మీది చిరునవ్వులా మాస్టారి ముఖంమీద చిరునగవు. తల నిమురుతూనే గంభీరంగా అన్నారు: "నాయనా, అమ్మ పిలుస్తోంది." గోపాలం జవాబివ్వలేదు. మాస్టారి మాటలు అతడికి వినిపించినట్టు లేవు. పైగా ఆమెకు మరింత దగ్గరయి, ఆమె జుత్తులోకి తన లేత వ్రేళ్లని దూర్చి ఆమెను ముట్టుకున్నాడు.

మాస్టారు గోపాలం తలమీద నించి చెయ్యి తీసి లేచి నిల్చున్నారు. అతడి కన్నులు చెమ్మగిల్లేయి. మాస్టారు అక్కడున్న అందరికీ కనుసన్న జేసేరు. అంతా కలిసి ఆమెను లేవనెత్తేరు. గోపాలం లేచి ఆమె తలదగ్గర నిలుచున్నాడు.

అంతా పూర్తయింది. అరవిందం మాస్టారు నిప్పు పట్టుకున్నారు. మాస్టార్లు నలుగురు కొమ్ముల దగ్గర నిల్చున్నారు.

ఎదురుగా ఉన్న కొత్త మాస్టారిల్లు తెరిచి ఉంది. ఇల్లు ఖాళీగా ఉంది. అతని జాడ ఎక్కడా లేదు. దూరదూరంగా అక్కడక్కడ చిన్నపిల్లలు నిల్చొని జరిగేది గమనిస్తున్నారు. పైడయ్య దూడ రెండు చెవులూ పట్టుకొని లాక్కెళ్తున్నాడు కరణం గారింటికి. సుబ్బమ్మ తిరిగి ఇంటికి పోతూ నెత్తిమీది కొంగు ముఖం మీదికి లాక్కొంది.

"హరి హరీ!" అన్నారు అరవిందం మాస్టారు. కొమ్ముల దగ్గరున్న నలుగురూ హరినామ స్మరణ చేసేరు.

పాడె మీదకి లేచింది. నడక ప్రారంభమయింది. ముందు అరవిందం మాస్టారు, అతన్ననుసరిస్తూ గోపాలం, వెనుక భుజాల మీద తేల్తూ పాడె మీద

**గోపాలం కేకలు విననట్లు నది అవతల ఒడ్డున పాడెమీద సుఖంగా నిద్ర పోతూందమ్మగారు!**

అమ్మగారు. దూరంగా మామిడి తోటలో కోయిల తియ్యగా పాడుతోంది. గాలికి రోడ్డు పక్కనున్న దేవదారు చెట్ల ఆకులు నేల రాలుతూ చప్పుడు చేస్తున్నాయి. సూర్యుడు నడినెత్తిన ఉన్నాడు. ఎండ తీవ్రంగా ఉంది. ఇసుకలో నడిచే పాదాల సడి. అందరూ చేసే హరి శబ్దం.

గోపాలం తల దించుకొని నడుస్తున్నాడు. చింతచెట్టు దగ్గరి కొచ్చింది. దాని నీడ ఒక పెద్ద మచ్చలా రోడ్డుమీద పడుతోంది. గోపాలం నీడలో ఆగి తల ఎత్తి చూసేడు. అమ్మగారి ముఖం కనిపించలేదు, చిరునవ్వుతో. నల్ల కాకులు రెండు ఒక గెద్దను వెంబడిస్తూ అరుచుకుంటూ పోతున్నాయి.

అంతా ఒక్కసా రాగారు. మాస్టార్లు భుజాలు మార్చుకున్నారు. నడక తిరిగి ప్రారంభమయింది. ఊరు పొలిమేర దాటింది గుంపు. పాములా మెలికలు తిరుగుతూ కొద్ది దూరాన కనిపిస్తోంది నది. దాని కిరుప్రక్కలా ఇసుక తిన్నెలు పౌడరు పూసుకున్న స్త్రీ ముఖాలలా మెరుస్తున్నాయి. నది అవతలి ఒడ్డున ఎవరూ తోడు లేకుండా. ఒక శవం కాలుతోంది.

నది దగ్గరయింది. ఇసుక దిబ్బల మీద నడక ప్రారంభమయింది. కాళ్ళు కూరుకపోతున్నందున వేగం తగ్గింది. నిప్పుల మీద నడుస్తున్నట్టుంది అందరికీ. గోపాలం తల ఎత్తకుండా నడుస్తున్నాడు.

కట్టెనుంచి ఆమె చీర సెంటువాసన ఇంత వేడిలోనూ మాస్టార్ల ముక్కులలోకి తగుల్తూ తచ్చాంతి కలిగిస్తోంది.

నది ఒడ్డున రెండు పడవలు తల్లక్రిందుగా పడి ఉన్నాయి. రాబోయే వర్షాకాలంలో ఉపయోగానికని వాటికి మరమ్మత్తు జరుగుతోంది. ఖాళీగా వచ్చిన వలని తిరిగి నీటిలోకి విసురుతున్నాడో యువకుడు. కొందరు బాలురు దిగంబరులై నీట్లో ఈత కొట్టడానికి బ్రహ్మ ప్రయత్నం చేస్తున్నారు.

ఇంతలో ఇసుకలో కాళ్లకేదో గట్టిగా తగలగా ఆగిపోయేడు గోపాలం. గుంపు ముందుకు సాగిపోయింది.

కాలికి తగిలిన వస్తువు కోసం ఎంతో శ్రద్ధగా వెతకడం ప్రారంభించేడు గోపాలం. ఒక అడుగు దూరాన ఇసుకలో కూరుకొని ఉంది ఒక ఎముక, దానిని అంటుకొని రెండు తెల్లటి పళ్లు. గోపాలం కళ్లు మెరిసేయి. ఆ ఎముక నందుకొని, ఆ పళ్లని ఎంతో తీక్ష్ణంగా పరీక్షిస్తూ నిలుచున్నాడు. రాను రాను అతడి ముఖం వికసించింది. చెక్కిళ్లెర్రబారి, పెదాలు వణికేయి.

ఆ ఎముక ముక్కను గట్టిగా రెండు చేతులతోనూ నొక్కి పట్టుకొని గుంపు వేపు పరుగుతీసేడు గోపాలం. గుంపు నది దాటుతోంది. ఏటి మధ్యకు చేరుకున్నారంతా అప్పుడే. నీరు అందరికీ మొలవరకూ వచ్చింది.

నదిలోకి పరుగు తీసేడు గోపాలం. ఐదు గజాల దూరం పోగానే నీరు పీక వరకూ వచ్చింది. చేతులు రెండూ పైకెత్తి ఆ నీటి ప్రవాహంలో ఆగిపోయే డతడు.

గుంపు నదిని దాటి అవతలి ఒడ్డుని చేరుకుంది.

గోపాలం పెదవులు వణకుతున్నాయి. కళ్లలో చెప్పలేని ఆనందం తొణికిసలాడుతోంది. నదిలోని ఇసుక అతడి చిట్టి పాదాల్ని క్రిందికి లాగేస్తోంది.

తనకుండే శక్తినంతా గొంతులోకి చొప్పించి కేక పెట్టేడు గోపాలం.

"అమ్మగారోయ్! అమ్మగారూ! ఇంక ఒచ్చేయండి. ఒచ్చేయండమ్మగారూ. ఇవిగో పళ్లు. చిల్లంగి మాస్టారు పోయేరు! ఇవిగో అతని ముందు పళ్లు రెండూ! అమ్మగారోయ్! వచ్చేయండింక!"

గోపాలం కేకలు విననట్టు నది అవతలి ఒడ్డున పాడెమీద సుఖంగా నిద్రపోతూం దమ్మగారు! ●